క్లుప్తంగా

యువకుల రక్తదాన శిబిరం

గోపాలపురం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్థానిక అరుంధతీనగర్‌కు చెందిన యువకులు రక్తదాన శిబిరం నిర్వహించారు. సోమవారం స్థానిక చెక్‌పోస్టు సెంటర్ వద్ద బీజేపీ అధికార ప్రతినిధి గెల్లా శ్రీనుబాబు దీనిని ఏర్పాటు చేశారు. సుమారు 50 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కర్రి సతీష్‌కుమార్ పాల్గొన్నారు. ఇలాఉండగా మండలంలోని పెద్దగూడెం, గుడ్డిగూడెం, దొండపూడి, చిట్యాల, గోపవరం, వాదాలకుంట, కోమటికుంట, జగన్నాథపురం, వేళ్లచింతలగూడెం గ్రామాల్లో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాలకు వివిధ వర్గాల వారు నివాళులర్పించారు.

జన్మదిన వేడుకల్లో మాజీ మంత్రి వనిత



రామమోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి వనిత

గోపాలపురం: మాజీ సొసైటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కూసం రామమోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మాజీ హోం మంత్రి, పార్టీ క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు డాక్టర్ తానేటి వనిత హాజరయ్యారు. ఈ సందర్భంగా రామమోహన్‌రెడ్డికి ఆమె జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, వెలగా శ్రీరామమూర్తి, నాయకులు పోతుల అప్పిరెడ్డి, పడమట సత్యనారాయణ, వింత ప్రసాదొరెడ్డి, కాకులపాటి శ్రీనివాస్, సాలి వేణు, ఎస్‌కే వల్లీ, తుమ్మూరి సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సత్కారం

నల్లజర్ల: ముసుళ్లగుంటలో ప్రకృతి వ్యవసాయం చేస్తూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించిన రైతులు నందమూరి సుబ్రహ్మణ్యం, కొయ్యలమూడి రాజేష్‌ను ఎంపీడీఓ సింహాద్రి, సర్పంచ్ నందమూరి శారదదేవి సత్కరించారు. సోమవారం ఆ గ్రామంలో సర్పంచ్ నందమూరి శారదాదువి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ విభాగం మాస్టర్ ట్రైనర్ తమ్మిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైతులను సత్కరించారు. పుల్లలపాడులో ర్యాలీ నిర్వహించి ఖరీఫ్ సీజన్ 45రోజులు ముందు రైతులు తమ పొలాల్లో భూమి సాంద్రత పెంచే విధంగా నవధాన్యాల సాగు చేయాలని కోరారు.

జిల్లా ఆసుపత్రిగా మార్పు చేయాలని వినతి

కొవ్వూరు: రాష్ట్రంలో ఆరోగ్య శ్రీ వైద్య సేవలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. పట్టణంలో బీజేపీ నేత కోడూరి లక్ష్మీనారాయణ కుమారుడి వివాహానికి హాజరైన ఆయన సోమవారం రాత్రి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధాకృష్ణ స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. రాజమహేంద్రవరంలో వైద్య కళాశాల ఉన్నందున కొవ్వూరు ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా మార్చాలని జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, పరిమి రాధాకృష్ణ విన్నవించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆసుపత్రి స్థాయి పెంచినా వైద్యుల భర్తీ కష్టసాధ్యమవుతుందని పేర్కొన్నారు. మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. వివరాలు పంపితే ఏరియా ఆసుపత్రిగా మార్చే విషయం పరిశీలిస్తానని సూచించారు. పీ–4 విధానంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని కొవ్వూరులో ఏర్పాటు చేసేందుకు ఔత్సాహిక దాతలుంటే ప్రభుత్వం ద్వారా సహకరిస్తామని వెల్లడించారు. ఆరోగ్యశ్రీ వైద్యసేవలు అన్నీ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నాయని ప్రకటించారు. ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు: పట్టణంలోని అగ్నిమాపక కేంద్రంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సోమవారం అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభించారు. సేవలందిస్తూ మరణించిన సిబ్బందికి ఆయన అమరవీరుల స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అగ్ని ప్రమాదాల నివారణ–చర్యలపై తీసుకోవాల్సిన చర్యలపై అగ్నిమాపక శాఖ ముద్రించిన వాల్‌పోస్టర్లను మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, జిల్లా సహాయక అగ్నిమాపక అధికారి కె. శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మీ, పట్టణ జనసేన అధ్యక్షుడు రంగా రమేష్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు వైఎస్సార్ సీపీ కృషి

- మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సామాజిక న్యాయం
- మాజీ ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడు
- వాడవాడలా ఘనంగా అంబేడ్కర్ జయంత్యుత్సవాలు
- అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు



దూబచర్ల జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ హోంమంత్రి తానేటి వనిత



నిడదవోలు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడు, నాయకులు



చాగల్లులో అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు

నిడదవోలు: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవాన్ని సోమవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల్లో సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. నిడదవోలులో వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలో చర్చిపేట, ఇందిరానగర్, సుబ్బరాజుపేటలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంత్యుత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జి. శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాల సాధనకు వైఎస్సార్ సీపీ కృషి చేస్తోందన్నారు. అంబేడ్కర్ కన్న కలలను సాకారం చేసేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాలకు అధిక శాతం పదవులు కేటాయించడంతోపాటు ఆదర్శవంతమైన పాలనతో సామాజిక న్యాయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యలడాడ బాలరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, ఎంపీపీ భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని ఎస్వీఆర్‌కే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ లెఫ్టినెంట్ డాక్టర్ డి. రుద్ర, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించాలి

లౌకిక రాజ్యాంగ పరిరక్షణే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఘనమైన నివాళులని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు అన్నారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో పట్టణంలో పలు కేంద్రాల్లో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. చర్చిపేట యూత్ బైక్ ర్యాలీ నిర్వహించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

చాగల్లు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు. మండలంలో అంబేడ్కర్ జయంతిని అన్ని గ్రామాల్లో నిర్వహించారు. చాగల్లులో నిర్వహించిన కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నవోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహానికి తలారి వెంకట్రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంధ్రోతు సురేంద్ర కుమార్, సర్పంచ్ ఉన్నమట్ల శాంతి, మండల పార్టీ అధ్యక్షులు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, పార్టీ గౌరవాధ్యక్షులు జుట్టా కొండలరావు, గేడా శ్యామ్, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు, మండల పరిషత్ కార్యాలయం, మార్కొండపాడులో ఎంపీపీ మట్టా వీరాస్వామి తదితరులు అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. బ్రాహ్మణగూడెంలో ఎస్సీ ఏరియాలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో జయంత్యుత్సవాలు నిర్వహించారు. ఊనగట్ల. నెలటూరు, కలవలపల్లి, చంద్రవరం, మల్లవరంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

అందరివాడు అంబేడ్కర్

గోపాలపురం: అంబేడ్కర్ అందరివాడు అని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపాలపురం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెలగా శ్రీరామమూర్తి అన్నారు. కోమటికుంటలో రూ. 4 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన అంబేడ్కర్ భవనాన్ని ఆయన సతీమణి సర్పంచ్ వెలగా ప్రమీలా రాణి చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ యూత్ కమిటీ సభ్యులు శ్రీరామమూర్తి దంపతులను సత్కరించారు.

అంబేడ్కర్ యువతకు స్ఫూర్తి

తాళ్లపూడి: ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు పేర్కొన్నారు. తాళ్లపూడి, వేగేశ్వరపురం ప్రక్కిలంక, అన్నదేవరపేట, గజ్జరం, పెద్దేవం, తిరుగుడుమెట్ట, తాడిపూడి గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, ఎంపీడీవో వెంకటరమణ పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. తాళ్లపూడిలో యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేగేశ్వరపురంలో నవ చైతన్య యూత్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ప్రక్కిలంకలో జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యాళ్ల బాబూరావు, ఏఎస్‌వో జె.వెంకటేశ్వరావు, యూత్ సభ్యులు పాల్గొన్నారు. పెద్దేవంలో సమతా యూత్ సభ్యులు నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ పాల్గొన్నారు. అన్నదేవరపేటలో జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో, మలకపల్లిలో డీఎస్ఎఫ్ యూత్ ఆధ్వర్యంలో, గజ్జరం పోచవరం, తాడిపూడి తదితర గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు.

అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

పెరవలి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని న్యాయవాది రొంపా కిషోర్ తెలిపారు. అంబేడ్కర్ జయంత్యుత్సవాన్ని మండలంలోని 18 గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. పెరవలి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కార్చెర్ల ప్రసాద్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. కానూరు, నడుపల్లి, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు, కాపవరం, ముక్కామల, ఖండవల్లి, మల్లేశ్వరం, అన్నవరప్పాడు అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు మాజీ సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

సామాజిక సమానత్వం కోసం అంబేడ్కర్ కృషి

ఉండ్రాజవరం: సామాజిక సమానత్వం కోసం డాక్టర్ అంబేడ్కర్ విశేష కృషి చేసారని ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి అన్నారు. ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీడీవో వి.రామారావుతో కలిసి ఆమె పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తహసీల్దార్ పీఎన్‌డీ. ప్రసాద్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దమ్మెన్నులో సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్

దేవరపల్లి: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలను దేవరపల్లి మండలంలోని గ్రామాల్లో వాడవాడలా సోమవారం అంబేడ్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రభుత్వ అధికారులు, విద్యాసంస్థల అధిపతులు, అంబేడ్కర్ వాదులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంబేడ్కర్ జీవిత చరిత్రను ప్రజలకు వివరించి, ఆయన ఆశయాలను యువత ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. దేవరపల్లిలో పాతపేట, కొత్తపేటలోని అంబేడ్కర్ సెంటర్లలో జయంతి వేడుకలను నిర్వహించారు. యర్నగూడెం, దేవరపల్లి గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, మాజీ మంత్రి కేఎస్ జవహర్, సర్పంచ్ బొంతా భరత్‌బాబు అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద, పాతపేటలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ కేవీకే దుర్గారావు, సర్పంచ్ కడిమి వీరకుమారి, సొసైటీ మాజీ అధ్యక్షులు కవల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కేక్‌కట్ చేసి వేడుకలు నిర్వహించారు. సీపీఎం నాయకులు ఉండవల్లి కృష్ణారావు, సీఐటీయూ నాయకుడు ఎస్.భగత్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డి.సువర్ణరాజు దేవరపల్లి, లక్ష్మీపురం, ధుమంతునిగూడెంలో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గొల్లగూడెంలోని దివ్యాగుల ఆశ్రమంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో పాల్గొని కేక్‌కట్ చేసి దివ్యాగులు, వృద్ధులకు స్వీట్లు పంచారు. చిన్నాయగూడెంలో వైఎస్సార్ సీపీ నేతలు గడా జగదీష్, గడా రాంబాబు, మాజీ ఎంపీపీ గడా మురళీ అజీత్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ ముమ్మిడి సత్యనారాయణ, సర్పంచ్ డెగపాటి జ్యోతిరాణి తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ప్రజాస్వామ్య ప్రదాత అంబేడ్కర్

నిడదవోలు రూరల్: ప్రజాప్రదాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భాగ్యలక్ష్మి, అధికారులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమిశ్రగూడెంలో అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోరుమామిడి, అట్లపాడులో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. పురుషోత్తపల్లి, తాడిమళ్ల గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దళితుల ఆరాధ్య దైవం అంబేడ్కర్

కొవ్వూరు: భారత రాజ్యాంగ నిర్మాత, దళితుల ఆరాధ్య దైవం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు పేర్కొన్నారు. పట్టణంలో బస్టాండ్ సెంటర్‌లో పార్టీ లీగల్ సెల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కవల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంత్యుత్సవంలో ఆయన పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బ్రిడ్జిపేటలో నిర్వహించిన అంబేడ్కర్ జయంత్యుత్సవంలో ఆయన పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్, మాజీ ఏఎంసీ చైర్మన్లు బండి పట్టాభి రామారావు, వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనా రాయణ, కాకర్ల వెంకటేశ్వరరావు, చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు చిట్టూరి అన్నవరం సత్యనారాయణప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు గంధ్రోతు సురేంద్ర కుమార్, బయ్యే రవికుమార్, తరిపే బంగారయ్య, బొంతా నాగరాజు, మసా ఆనంద్, మెరిపో వీర్రాజు తదితరులు పాల్గొన్నారు. కొవ్వూరు మెరకవీధిలో, శ్రీరామ కాలనీలో అంబేడ్కర్ విగ్రహాల వద్ద నివాళులర్పించారు. పట్టణంలో టీడీపీ కార్యాలయంలో ద్వి సభ్య కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. తన కార్యాలయంలో ఆర్డీవో రాణి సుస్మిత, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ జె.సునీత, సీఐటీయు కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు, క్రిస్టియన్ పేటలో స్థానిక నాయకులు అంబేడ్కర్‌కు ఘన నివాళులర్పించారు.

అంబేడ్కర్ ఆశయాలు నెరవేర్చిన జగన్

నల్లజర్ల: అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మాజీ హోంమంత్రి, పార్టీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు తానేటి వనిత అన్నారు. నల్లజర్ల మండలం దూబచర్లలో అంబేడ్కర్ జయంతి వేడుకలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. అంబేడ్కర్ విద్యావంతులుగా ఎదిగి భారతదేశ చట్టసభల్లో ఉన్న రాజ్యాంగాన్ని ఆయన రచించినందుకు గర్వపడుతున్నామన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పేదలంతా ఆర్థికంగా బలపడాలని, అందరూ చదువుకొని విద్యావంతులు కావాలని రాజ్యాధికారంలో భాగస్తులు కావాలని గట్టిగా కోరుకునే వైఎస్ జగన్ గడచిన ఐదేళ్లలో దళితులు, బీసీలు, మైనార్టీ, అణగారిన వర్గాలందరికీ వారి పిల్లలను చదివించుకునే క్రమంలో విద్యావిధానంలో మార్పులు తీసుకువచ్చిన విషయాన్ని ఈసందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రమణ్యం, నాయకులు బంక అప్పారావు, తొమ్మండ్రు రవి,'ముప్పిడి వెంకటరత్నం,ఎ సత్యనారాయణ, తొమ్మండ్రు రమేష్, చేబ్రోలు బాలాజీ, ముండ్రు ప్రసాదరావు, తోట వెంకట్రావు, పిట్టా జాన్‌సుకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఘంటా వారిగూడెం, వైఎస్సార్ వసంత్ నగర్, జగన్నాథపురం, నల్లజర్లలో అంబేడ్కర్ వేడుకల్లో మాజీ మంత్రి వనిత పాల్గొన్నారు.



కోమటికుంటలో అంబేడ్కర్ భవనాన్ని ప్రారంభించిన శ్రీరామమూర్తి, సర్పంచ్ ప్రమీలారాణి



పెరవలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు



దేవరపల్లిలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా కేక్‌కట్ చేస్తున్న ఎంపీపీ కేవీకే దుర్గారావు, నాయకులు

చిరుధాన్యాల సాగుతో భూములు సారవంతం



ముక్కామలలో సేంద్రియ వ్యవసాయంపై ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు, రైతులు

పెరవలి: సేంద్రియ వ్యవసాయం మనిషి మనుగడకు ఎంతో మేలు చేస్తుందని అందుకోసం ప్రతి ఒక్కరూ సేంద్రియ వ్యవసాయం చేయాలని సేంద్రియ వ్యవసాయం జిల్లా కో ఆర్డినేటర్ సాకా రామకృష్ణ తెలిపారు. ముక్కామలలో సేంద్రియ సిబ్బంది, రైతులు, విద్యార్థులతో సోమవారం ర్యాలీ నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే సేంద్రియ వ్యవసాయం 45 వేల ఎకరాలకు చేరిందని ఇది మరింత పెరగాలని సూచించారు. పంట భూములు సారవంతంగా ఉండాలంటే సేంద్రియ వ్యవసాయమే మేలని అన్నారు. రసాయనిక ఎరువుల వలన పంట భూములు సారం కోల్పోతాయని వివరించారు. రైతులు మూడవ పంటగా చిరు ధాన్యాలను సాగు చేయాలని కోరారు. దీని వలన ప్రతి ఎకరానికి 10 టన్నుల సహజసిద్ధమైన ఎరువు తయారు కావడమే కాకుండా, నేల గుల్లబారి మరో పంటకు ఉపయోగపడుతుందన్నారు. 30 రకాల నవధాన్యాల కిట్‌లు అందిస్తున్నామని, రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పచ్చిరొట్ట పైర్లు సాగుకి మండలంలో ఖండవల్లి, ముక్కామల, కాపవరం, మల్లేశ్వరం, పెరవలి గ్రామాలను ఎంపిక చేసి చిరు ధాన్యాల విత్తనాలను అందిస్తున్నామన్నారు. నవధాన్యాల సాగుతో భూములకు సారం– రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి ముందస్తు ప్రణాళిక తయారు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా నవధన్యాల కిట్‌లను తయారు చేసి రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మనోరంజనీ, దీప్తి, వ్యవసాయ సిబ్బంది, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్ర ఏర్పాటు అభినందనీయం

నిడదవోలు రూరల్: వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్సై కె.వీరబాబు అన్నారు. సమిశ్రగూడెం పురాతన వంతెన వద్ద తృప్తి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్సై వీరబాబు సోమవారం ప్రారంభించి ప్రయాణికులకు రస్నా పంపిణీ చేశారు.ట్రస్ట్ చైర్మన్ వడ్లమూడి దేవదాసు, రాకడ సుదర్శనరాజు, కొల్లి శ్రీను, వెన్నపు వినోద్, మారే కిషోర్ పాల్గొన్నారు.

ముద్రగడను కలసిన వైఎస్సార్ సీపీ నాయకులు



కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభానికి అభినందలు తెలుతున్న నాయకులు

తాళ్లపూడి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభంను పొలిటికల్ అడ్వైజర్ కమిటీ సభ్యుడిగా నియమించిన సందర్భంగా కిర్లంపూడి స్వగృహంలో సోమవారం వైఎస్సార్ సీపీ తూర్పుగోదావరి జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి, శుభాకాంక్షలు తెలియచేశారు. పార్టీలో కష్టపడిన వారికి జగన్ మోహన్‌రెడ్డి తగిన గుర్తింపు ఇస్తున్నారని వారన్నారు. ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబును వారు కలిసారు. ఈ కార్యక్రమంలో తాళ్లపూడి మండల కాపు సంఘం అధ్యక్షుడు నామ ప్రకాశం, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు ఇంటి వీర్రాజు, కొవ్వూరు మాజీ ఏఎంసీ డైరెక్టర్ సుంకర రంగబాబు, జిల్లా కాపు టీచర్ అసోసియేషన్ మెంబర్ కేశవరపు ఆదిశేషుడు తదితరలున్నారు.

సుస్థిర పాలన బీజేపీ లక్ష్యం

కొవ్వూరు: దేశ ప్రజలకు సుస్థిరమైన పరిపాలన అందించడమే భారతీయ జనతా పార్టీ ప్రభుత్వ లక్ష్యమని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురేందేశ్వరి అన్నారు. పట్టణంలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అధ్యక్షతన పార్టీ క్రియాశీలక కార్యకర్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దేశాన్ని ప్రగతి పథంలోకి తీసుకెళ్లడానికి ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ పార్టీ క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులంతా కృషి చేయాలని సూచించారు. నియోజకవర్గ కో ఆర్డినేటర్ మాట్లా ఆంజనేయులు, పిల్లల మర్రి మురళీకృష్ణ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నల్లజర్ల: బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా నల్లజర్లలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాన్ని సీఐ రాంబాబు సోమవారం ఉదయం ప్రారంభించారు. ఎండలు తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా తాగునీరు కోసం వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు లేకుండా చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు అంబేడ్కర్ యూత్ అధ్యక్షుడు బొందల శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లిజ్యోతి, ఎస్సై రమేష్, జి. వెంకటసుబ్బారావు, పల్లి సుబ్బారావు, గుడే రాంబాబు, ప్రత్తి వినోద్‌కుమార్, గారపాటి బాబ్జి, గుడే రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గొడుగుల పంపిణీ

నిడదవోలు : ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారాలు చేసుకునే వారికి ఎండలకు వారు ఇబ్బందులు పడకుండా గొడుగులు అందజేస్తున్నట్టు బీజేపీ సీనియర్ నాయకులు రంగా వెంకటేశ్వరరావు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని సోమవారం ఆయన పట్టణ పరిధిలో 15 మంది చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కట్టుంగ అచ్చయ్య, నీలం రామారావు పాల్గొన్నారు.

కంటి మీద కునుకు కరువు

- అకాల వర్షాలతో రైతులకు ఇక్కట్లు
- తడుస్తున్న ధాన్యం రాసులు
- చేతికొచ్చిన పంట నీటిపాలు



దేవరపల్లి మండలం దుద్దుకూరు వద్ద తడిసిన ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్న కౌలు రైతు దంపతులు

దేవరపల్లి: అకాల వర్షాలు రైతులకు పది రోజుల నుంచి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పగలంతా ఎండ, రాత్రయ్యేసరికి ఆకాశంలో కారుమబ్బులు, ఉరుములు, మెరుపులు, భారీ ఈదురు గాలులతో అకాల వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చేతికొచ్చిన పంట నీటిపాలవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదునుగా దళారులు దోచుకుంటున్నారని చెబుతున్నారు. కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు మూడు నియోజవర్గాల్లో రబీ వరి కోతలు ప్రస్తుతం ముమ్మరంగా జరుగుతున్నాయి. కోసిన ధాన్యాన్ని రైతులు రోడ్లపై ఆరబెట్టి ఒబ్బిడి చేస్తున్నారు. దిగుబడులు బాగున్నాయి, నాలుగు డబ్బులు మిగులుతాయని ఆనందపడుతున్న తరుణంలో ప్రకృతి కన్నెర్ర చేస్తోందని రైతులు వాపోతున్నారు. అకాల వర్షంతో రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసి, రంగు మారుతోందని ఆవేదన చెందుతున్నారు. పగలంతా ధాన్యాన్ని ఆరబెట్టి, సాయంత్రం బరకాలు కప్పి ఇంటి వెళ్లేసరికి అకాల వర్షం కురుస్తోందని, బరకాల అడుగు నుంచి వర్షపు నీరు ప్రవహిస్తూండటంతో ధాన్యపు గింజలు తడిసిపోతున్నాయని రైతులు చెబుతున్నారు. వాతావరణం అనుకూలిస్తే రెండు రోజుల్లో ధాన్యం మిల్లుకు చేరుతుందని తెలిపారు. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రోడ్లపై ఉన్న ధాన్యం తడిసిపోయింది. ఆ సమయంలో ఏమీ చేయలేక రైతులు సోమవారం ఉదయం ధాన్యం రాశులను రోడ్డుపై ఆరబెట్టే పనిలో పడ్డారు. ఒక్క రోజు ఆగితే ధాన్యం మిల్లుకు వెళ్లేదని దుద్దుకూరుకు చెందిన కౌలు రైతులు పోలుమాటి గంగాధర్, పోలుమాటి భీమరాజు, పంది పేర్రాజు, చిగురుపల్లి పకీర్ తదితరులు చెప్పారు. వ్యవసాయం చేయడం చాలా కష్టంగా ఉందని, రాత్రి ఇంటికి వెళ్తే నిద్ర పట్టడం లేదని వాపోయారు. తడిసిన ధాన్యానికి ధరలో కోత విధిస్తున్నారని, ఈ కష్టాలు పడలేక అయినకాడికి అమ్ముకోవలసి వస్తోందని అన్నారు. వర్షాలకు మొక్కజొన్న, మామిడి, జీడిమామిడి, మిర్చి పంటలకు కూడా నష్టం వాటిల్లుతోందని రైతులు చెబుతున్నారు.